క్లుప్తంగా

జేకేసీలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జవహార్ నాలెడ్జ్ సెంటర్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీ, బీటెక్, డిప్లొమా చదువుతున్న/పూర్తయిన వివిధ కడపలోని కళాశాలల విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. మూడునెలల పాటు నిర్వహించే ఈ శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, అనలైటికల్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9347256400, 9490560441 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

13న వీహెచ్‌పీఎస్ ధర్నా

కడప రూరల్: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13న కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్‌లు తదితర అంశాల పరిష్కారానికి నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీస్ వ్యవస్థాపకులు మందకృష్ణ హజరు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో మాతయ్య, బి.ప్రసాద్, నాగయ్య, అంజి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న కలెక్టరేట్ ఎదుట ఆందోళన



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వామపక్ష నాయకులపై అక్రమంగా బనాయించిన కేసుల తీరుకు నిరసనగా ఈ నెల 8న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో తాలుకా సీఐ, ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక మాఫియా, ఎర్ర చందనం, భూ కబ్జాలను అదుపు చేయకుండా ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వంపై ప్రచార భేరీ నిర్వహిస్తే పోలీసులు సభలను అడ్డుకోవడం దారుణమన్నారు. జిల్లా ఎస్పీ స్పందించి సీఐ ఉలసయ్య, ఎస్‌ఐలు రామకృష్ణ, తాహిర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సత్తార్, వెంకట శివ, కెసీ బాదుల్లా, సీఆర్‌వీ ప్రసాద్, భాగ్యలక్ష్మీ, గంగా సురేష్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలి

వైవీయూ: రెజ్లింగ్ క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద ఢిల్లీలో రెజ్లర్లపై పోలీసుల లాఠీచార్జిను నిరసిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడాకారిణులపై వేధింపులకు పాల్పడ్డారన్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలన్నారు. ఒలంపిక్స్‌లో పతకాలు తీసుకువచ్చిన వారికి అండగా నిలవాల్సిన ఫెడరేషన్ అధ్యక్షుడు, వారిపైనే లైంగిక వేధింపులకు పాల్పడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఐవెఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఇనాయతుల్లా, డేవిడ్‌రాజ్, పాములేటి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని, కుటుంబానికి రోజుకు అరలీటర్ పాలు ఇస్తామని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో హామీలు ఇస్తున్నారన్నారు. ప్రధాని మోదీ కర్ణాటకు మాత్రమే ప్రధానమంత్రా.. ఇతర రాష్ట్రాలకు కాదా అని ప్రశ్నించారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఉన్న రాష్ట్ర బీజేపీ నాయకులు ఇక్కడ ఉచితాలు ఎందుకు ఇవ్వరో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం నాయకులు అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు -2పై 7న అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్: కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తేజ పెట్రోల్‌బంక్ పక్కన గల శంకర్‌రెడ్డీస్ సాయి బాలాజీ కోచింగ్ సెంటర్‌లో 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రూపు-2, ఇతర పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆసంస్థ డైరెక్టర్ ఏ. శంకర్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 9966787371, 8886142609 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

టవర్ క్లాక్‌కు టైమొచ్చింది!

● 88 ఏళ్ల తర్వాత కొత్త గడియారం

కడప కల్చరల్ : కడప నగరంలోని వైవీ స్ట్రీట్ వద్ద గల టవర్ క్లాక్‌కు మంచి టైమ్ వచ్చింది. అందులో నిలిచిపోయి ఉన్న పాత గడియారం స్థానంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నూతన గడియారాన్ని ఏర్పాటు చేశారు. 50 ఏళ్లుగా గడియారం పనిచేయకపోవడం లేదు. ప్రస్తుత డిజిటల్ యుగంలోనూ టవర్‌పైన మంచి గడియారాన్ని ఏర్పాటు చేయకపోవడంపై నగరవాసులు నిరాశ వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు పాత గడియారం స్థానంలో దాదాపు అదే మాదిరిగా కనిపిస్తున్న కొత్త గడియారాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 88 సంవత్సరాల తర్వాత కొత్త గడియారం ఏర్పాటు కావడం విశేషమంటూ నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాత గడియారం.. ముక్కలై ఇలా..

గడియారం కథ

1935లో రహమతుల్లా మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు సెప్టెంబరు 15న నాటి కలెక్టర్ హెచ్.సాంబమూర్తి ఈ బురుజుపై ఎత్తయిన స్తంభాన్ని, దానికి నాలుగు వైపుల పెద్ద గడియారాల నిర్మాణాన్ని ప్రారంభించారు. 1956 మే 24న నాటి కలెక్టర్ బీఆర్‌కే శాస్త్రి ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి దీన్ని ప్రారంభించారు. నగరానికి అదో ఆభరణంగా, ఐకాన్‌గా నిలిచిపోయింది. కాగా తొలగించిన పాత గడియారాన్ని మరమ్మతులు చేసి కేవలం ప్రదర్శన కోసం మ్యూజియంలో పెట్టే అవకాశాన్ని పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.



కొత్తగా అమర్చిన గడియారం

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప స్పోర్ట్స్: వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ సూచించారు. శుక్రవారం నగరంలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణలో భాగంగా తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తైక్వాండో శిక్షణ ద్వారా ఆత్మస్థైర్యం, మనోవికాసం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు సైతం ఇలాంటి క్రీడల్లో పాల్గొనేలా చిన్నారులను ప్రోత్సహించాలని సూచించారు. తైక్వాండో శిక్షకుడు జంషీర్, మాస్టర్ బిలాల్, మాజీ కార్పొరేటర్ బండిబాబు, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన క్రీడాకారులు

పోలీసు పిరమిడ్ కేంద్రంలో బుద్ధ జయంతి

కడప కల్చరల్ : బుద్ధ జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయం వద్దగల పోలీసు పిరమిడ్ ధ్యాన కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ స్పిర్చువల్ సభ్యులు, అధ్యక్షుడు జీవీ శేషారెడ్డి మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఒనగూరే లాభాలు, శాకాహారంతో చేకూరే ఆరోగ్యం గురించి వివరించారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఊర్మిళాదేవి కూడా మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు. సొసైటీ సలహాదారు గజ్జల రామసుబ్బారెడ్డి, మాస్టర్ ఓబయ్య, రమణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్టర్ ఓబయ్య

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వానికి దొడ్డిదారి బదిలీలపై ఉన్న ఆసక్తి సాధారణ బదిలీలపై లేదని యూటీఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. శుక్రవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ ఉపాధ్యాయ బదిలీలు నిర్వహిస్తామని ఉపాధ్యాయలోకాన్ని ఊరిస్తూ ప్రస్తుతం మాత్రం ప్రభుత్వ బదిలీలను ఆఘమేఘాలపై నిర్వహించడం సరికాదన్నారు. ఇలా ప్రభుత్వ బదిలీలు నిర్వహించడం వల్ల సాధారణ ఉపాధ్యాయలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రభుత్వం వెంటనే ఈ బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా ట్రెజరర్ దావుద్దీన్, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాజ్ అహమ్మద్ నాయకులు కిరణ్‌కుమార్, అబ్దుల్‌గని, ప్రభాకర్‌బాబు, చెన్నకేశవులు, శ్యామ్‌సుందర్, స్వతంత్రబాబు, కొండయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ యాదవ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా పెండ్లిమర్రి మండలానికి చెందిన చంద్రశేఖర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యల్లారెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ నాయకులు ప్రభుకుమార్, గొర్రె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్ యాదవ్

18న ఖత్నా

కడప కల్చరల్: అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి, అమీన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదిన ఉచిత ఒడుగులు (ఖత్నా) కార్యక్రమం నిర్వహించనున్నామని కడప పెద్దదర్గా ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు ఈనెల 2వ తేది నుంచి స్వీకరిస్తున్నామన్నారు. ఈనెల 16వ తేదీలోగా తల్లిదండ్రులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. నగరంలోని నజ్ముల్ అమీన్ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమంలో ఒడుగులు చేయించుకున్న బాలురకు వస్త్రాలు, మందులు, నెయ్యి, గోధుమపిండి ఉచితంగా అందజేస్తామన్నారు. పేద వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఇతర వివరాలకు 94408 37829, 98852 94737 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాలెం : మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ ఊరేగింపు సందర్భంగా ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారి ఊరేగింపు గ్రామ పురవీధులలో వైభవోపేతంగా జరిగింది. ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ రాధ, దామోదర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని కనుల పండువగా అలంకరించారు. ఆలయ మండపంలో 108 మంది ముత్తయిదువులతో సుమంగళిపూజ, అనంతరం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం అష్టోత్తర శతదీపాలంకార సే, రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

ఘనంగా వరదరాజులస్వామి కల్యాణం

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపం దేవరకోనలో వెలసిన వరదరాజులస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు పాల్గొని కల్యాణ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజులస్వామి ఉత్సవ మూర్తులకు కిరీటాలు, పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి రోజున స్వామివారికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఊరేగింపుగా దేవరకోనకు తీసుకొచ్చి వేద పండితులు గరుడాద్రి కృష్ణ ప్రసాద్‌రెడ్డి, సోమశేఖర శర్మల ఆధ్వర్యంలో కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. చెక్క భజనలు భక్తులను అలరించాయి. రాత్రి నిర్వహించిన పంచరత్నాలు పౌరాణిక నాటకాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై ఎంపీకి వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో వెలిదండ్ల పంచాయతీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబురెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తాతిరెడ్డిపల్లె, అక్కులగారిపల్లె, చిన్నకుడాల గ్రామాల సర్పంచ్‌లు మల్లికేశ్వరరెడ్డి, నాగేంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్తా రమేష్‌కుమార్‌రెడ్డి, గండి క్షేత్ర బోర్డు మెంబర్ అంకాల్‌రెడ్డి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని యరమలపల్లె, పోచంరెడ్డిపల్లె గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలకు అర్హులై ఉండి అందని వారు ఉంటే వెంటనే సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిమెంటు రోడ్లు, రేషన్‌కార్డులు, పక్కాగృహాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సర్పంచు సౌజన్యరెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అధికారులుపాల్గొన్నారు.

ఫోన్ చేస్తే చాలు స్పందిస్తా

వల్లూరు : ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు ఫోన్ చేస్తే చాలు వెంటనే స్పందిస్తానని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. వల్లూరులో శుక్రవారం మసీద్‌లో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం స్థానిక సమస్యలను గురించి వారితో చర్చించారు. వల్లూరు ముస్లిం స్మశాన వాటిక ఆక్రమణలకు గురయ్యే అవకాశం వున్న నేపథ్యంలో హద్దులు ఏర్పరచి, ప్రహరీ గోడను నిర్మించాలని, అలాగే స్థానిక దర్గాకు ప్రహరీ గోడను నిర్మించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మసీదు కమిటీ చైర్మన్ ఫయాజ్, రసూల్, కరీముల్లా, కరీముల్లా షాద్రీ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కన్నుల పండువగా రథోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. అనంతరం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేశారు. అనంతరం పురవీధుల్లో శివనామ స్మరణల మధ్య రథోత్సవం వైభవంగా జరిపారు. ఆలయ ఈఓ శంకర్ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా లక్ష్మినరసింహస్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లెలో లక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు రెండవ రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం, గణపతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గరుడసేవ కార్యక్రమం నిర్వహించారు. చెక్కభజన పలువురిని ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మొదటి బహుమతి రూ.50వేలు, రెండవది రూ.40వేలు, మూడవది రూ.30 వేలు, నాల్గవది రూ.25వేలు, ఐదవది రూ.20వేలు, ఆరవది రూ.15వేలు కార్యనిర్వాహకులు అందజేశారు.



బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

అందరికీ మంచి జరగాలి

చక్రాయపేట : ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని కోరినట్లు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగారపువాండ్లపల్లె వద్ద నూతనంగా నిర్మించిన చింతల గంగమ్మదేవత ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మొలకలపౌర్ణమి సందర్భంగా చింతలగంగమ్మ ఆలయంలో దాన్యాధివాసం, హోమకలిశ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మండలానికి చెందిన ప్రజల సమస్యలను ఆయన తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పులివెందుల ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీ ఆగ్రోస్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాదవీ బాలకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, రుక్మిణి, పార్టీ నేతలు సూర్యనారాయణరెడ్డి, ఉత్తమారెడ్డి, మల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పుష్పగిరి గిరి ప్రదక్షిణ

వల్లూరు : పుష్పగిరి పుణ్యక్షేత్రంలో బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని శుక్రవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీలక్ష్మీ చెన్నకేశవ, శ్రీసంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. దాతలు భక్తులకు అల్పాహారం, మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : మండల పరిధిలోని అంబవరం, లింగాయపల్లె గ్రామాల్లో శనివారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు వల్లూరు గ్రామ సచివాలయ పరిధిలోని లింగాయపల్లెలో, 3.30 గంటలకు దిగువపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని అంబవరంలో జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎల్లమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధం

చెన్నూరు : స్థానిక కేఓఆర్ కాలనీలో ప్రసిద్ధిగాంచిన ఎల్లమ్మతల్లి జాతరకు నిర్వాహకలు సర్వం సిద్ధం చేశారు. శనివారం గ్రామంలో ఎల్లమ్మతల్లి సోదరుడు పోతురాజు ఊరేగింపు, ఆదివారం ఎల్లమ్మతల్లి జాతరను నిర్వహిస్తారు, మొలకల పౌర్ణమి తర్వాత వచ్చే మొదటి ఆదివారం ఎల్లమ్మతల్లి జాతర నిర్వహిస్తారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి ఆలయం చుట్టూ స్థలానికి దాతల సహకారంతో ప్రహరీ గోడ నిర్మించడమే కాకుండా గోడలపై దేవతల రూపాలను పెయింటింగ్ వేయడం ఎంతో ఆకర్షణగా ఉందని తెలిపారు. ఇంకా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: సెలవుల్లోనూ జిల్లాలో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు తరగతులను నిర్వహిస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కడప విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేసవి సెలవులు ప్రకటించి నాలుగైదు రోజులు కాకముందే ప్రైవేటు, కార్పొరేట్ వారు విద్యా సంవత్సరం ప్రారంభించారన్నారు. దీంతో విద్యార్థులు మానసిక ఆందోళనకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కళాశాల అధ్యక్షులు హరి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మాచుపల్లెలో బండలాగుడు పోటీలు

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామంలో శ్రీ రేణుకా యల్లమాంబ తిరుణాల సందర్భంగా ఆదివారం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం అమ్మవారికి బోనాలు , మొక్కుబడులను చెల్లించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన యడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ. 1,00,116, రెండవ బహుమతి రూ. 70,116, మూడవ బహుమతి రూ. 50,116, నాల్గవ బహుమతి రూ. 30, 116, ఐదవ బహుమతి రూ. 20,116 అందజేస్తామన్నారు.

మొక్కలు.. మానవాళికి నేస్తాలు

కమలాపురం : మొక్కలే మానవాళికి జీవాధారం అని సీఎస్‌ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.అశోక్‌కుమార్, సి.అయ్యవారప్పల నేతృత్వంలో కళాశాలలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలే మానవాళికి జీవాధారం అని మొక్కలు లేనిదే మనుషులకు జీవనం లేదన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని విరివిగా మొక్కలు నాటారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి, కళ్యాణ మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేంగా పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. గణపతి, నవగ్రహ, లక్ష్మీ నరసింహ, సుదర్శన హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి సుమూహూర్తంలో కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

కమనీయం... కల్యాణం

సిద్దవటం: మండల శివారులోని జె.ఎం.జె కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, భారతి దంపతులు, వీరి కుటుంబ సభ్యులు స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వేద పండితులు ప్రతాప్ శర్మ, నరేషశర్మలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి హాజరై కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు, రాజానాయుడు, రిటైర్డ్ తహసీల్దారు గంగులయ్య, మాజీ గ్రంథాలయ చైర్మన్ రామకోటిరెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి తిరుణాల

ఖాజీపేట: శ్రీ వీరాంజనేయ స్వామి తిరుణాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీలను ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం రెండు ఎద్దుల పోటీలు, ట్రాక్టర్ ట్యాలీతో రివర్స్ పోటీలు నిర్వహించారు. పిల్లల కోసం ప్రత్యేక పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు.